మహిళ లకిచ్చిన హామీల సంగతేంటి?

- నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం
- జాగృతి నేత నవీన్ ఆచారి హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 7 (నమస్తేతెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, మారపల్లి మాధవి, రూప్‌సింగ్ డిమాండ్ చేశారు. లేదంటే జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించిన పోస్ట్‌కార్డుల ఉద్యమంలో భాగంగా సీఎంకు రాసిన 10వేల కార్డులను శుక్రవారం ప్రజాభవన్‌లో ని ప్రజావాణిలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని నిలదీశారు. కార్యక్రమంలో నరేందర్‌యాదవ్, సంతోష్, మారయ్య పాల్గొన్నారు.

అనర్హులకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

- అంగన్‌వాడీ ఉద్యోగస్తురాలి ఖాతాలో డబ్బులు జమ
- బీఆర్ఎస్‌కు ఓటేశారని పడుగురి పేర్లు తొలగించిన నేతలు

కొల్లాపూర్ రూరల్, మార్చి 7 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ నాయకులు కోతలు విధిస్తున్నారు. ఇటీవల ఎన్మన్‌బెట్ల గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల్లో ఏడుగురు బీఆర్ఎస్‌కు ఓట్లు వేశారనే అనుమానంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత వారి పేర్లను జాబితా నుంచి తొలగించారు. అర్హత లేని ఓ అంగన్‌వాడీ ఉద్యోగుస్తురాలికి ఇందిరమ్మ పథకం వర్తింపజేశారు. కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా తొలగించిన ఏడుమందిలో చెన్నమ్మ (భర్త చనిపోయాడు), భాగ్యమ్మ (భర్త చనిపోయాడు), లాలమ్మ (కొడుకు మృతి చెందాడు), కూలీ పని తప్ప ఆధారం లేదు. మల్లమ్మ, మల్లేశ్వరితోపాటు మిగితావారికి పొలం కూడాలేదు. ఎలాంటి ఆధారంగా లేకుండా జీవిస్తున్న వారిపై కనికరం లేకుండా సంక్షేమ పథకాన్ని కట్ చేయడంతో స్థానికులు కన్నెర్ర చేస్తున్నారు.

కాంగ్రెస్ గారడీలో సామాన్యులే సమిధలు

- 15 నెలల్లోనే అనేక రంగాలు ధ్వంసం
- ఆర్ఆర్ ట్యాక్స్, హైడ్రాతో అరాచకం
- నాడు ఎల్ఆర్ఎస్ వద్దు.. నేడు ముద్దా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ 15 నెలల పాలనలో అనేక రంగాలు ధ్వంసమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం కోసం ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ఆదాయం కోసం ఎల్ఆర్ఎస్ ముద్దు అంటున్నారని ఎద్దేవాచేశారు. హైడ్రా, ఆర్ఆర్ ట్యాక్స్ పేరితో హైదరాబాద్‌లో అరాచకం సృష్టిస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్ల కూలుస్తున్నారని, హైడ్రా, మూసీ చర్యల కారణంగా రిజిస్ట్రేషన్లు పడిపోయారని, ఆదాయం లేక ఖజానా ఖాళీ అయిందని మండిపడ్డారు. ఏడాది పాలనలో లక్షన్నర కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపారని, 420 హామీలు మాత్రం అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిర్వాకం మూలంగా రియల్టర్లు కూడా ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కారు గారడీలో సామాన్యులే సమిధలవుతున్నారని, జాగో తెలంగాణ జాగో అని శుక్రవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

పౌరుల డిజిటల్ గోప్యతకు ప్రమాదం

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఐటీ చట్టం వల్ల పౌరుల డిజిటల్ గోప్యతకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్ ఖాతాలను పరిశీలించేందుకు ఐటీ అధికారులకు అనుమతివ్వటం పౌరుల గోప్యతకు భంగకరమని పేర్కొన్నారు. ఇది అధికార దుర్వినియోగం కింది దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. పౌరుల ఆర్థిక సమాచారం ఇప్పటికే అనేక వేదికల్లో నిక్షిప్తమై ఉన్నదని, ఐటీ అధికారుల అక్రమ చొరబాటుకు అవకాశం కల్పించటం పౌరుల ప్రాథమిక హక్కులకు, డిజిటల్ గోప్యతకు భంగం కలిగించడమేనని విమర్శించారు. 'ఏదైనా దుర్వినియోగం జరిగితే ఎవరు జవాబుదారీగా నిలబడతారు? ప్రధాన మంత్రా? లేక కేంద్ర ఆర్థిక మంత్రా?' అని నిలదీశారు.

ఇతర రాష్ట్రాలకు మన పెట్టుబడులు

తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. 'కేన్స్ గుజరాత్‌కు వెళ్లింది. కార్నింగ్ తమిళనాడుకు వెళ్లింది. ఇప్పుడు సోలార్ ఉత్పత్తి చేసే కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ ఏపీకి వెళ్లిపోతున్నది. మల్టీ నేషనల్ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయి' అని వాపోయారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులను కూడా కాంగ్రెస్ పాలకులు పట్టుకోలేకపోతున్నరు. ఏం దురదృష్టం రాహుల్ గాంధీజీ' అని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు.

బిజినెస్ స్టాండర్డ్‌కు ధన్యవాదాలు

'కొన్ని కథలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. కిటెక్స్ కంపెనీని తెలంగాణకు తెచ్చాం. రూ.3,000 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టించాం. మా ప్రభుత్వంలో జరిగిన ప్రయత్నాలపై బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. ఆ కథనాన్ని ఇచ్చిన బిజినెస్ స్టాండర్డ్‌కు ధన్యవాదాలు' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

నిరాశ్రయుల కేంద్రాన్ని అందుబాటులోకి తేండి

నల్లగొండలో రూ.1.66 కోట్లతో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పట్టణ నిరాశ్రయుల వసతి కేంద్రం నిరుపయోగంగా ఉన్నదని, దాన్ని తిరిగి పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆ జిల్లా కలెక్టర్‌ను కేటీఆర్ కోరారు. జిల్లా ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో నిర్మించిన ఈ కేంద్రాన్ని 2023 అక్టోబర్‌లోనే ప్రారంభించినట్టు తెలిపారు. ఓ నెటిజన్ ఈ సమస్యపై ట్వీట్‌చేయగా, కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.

శ్రీ 'విద్య'కు కేటీఆర్ భరోసా

- అవసరమైన సర్టిఫికెట్లు ఇప్పిస్తానని, చదువు పూర్తయ్యే వరకు ఫీజులు చెల్లిస్తానని హామీ
- మళ్లీ బడికి వెళ్తున్న చిన్నారి శ్రీవిద్య
- మాజీ మంత్రి కేటీఆర్‌కు బాలిక తల్లిదండ్రుల కృతజ్ఞతలు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన భరోసాతో చిన్నారి శ్రీవిద్య మళ్లీ స్కూలు గడప తొక్కింది. ఆమె కలలకు కేటీఆర్ రెక్కలు తొడగడంతో మళ్లీ బడిబాట పట్టింది. సరైన పత్రాలు లేవని హైదరాబాద్ సనత్‌నగర్‌లోని దాసారం బస్తీకి చెందిన మల్లెల శ్రీవిద్య అడ్మిషన్‌ను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం రద్దు చేసింది. బాగా చదువుకోవాలని ఆశపడ్డ శ్రీవిద్యకు ఆధార్‌కార్డు రూపంలో ఎదురైన సమస్య గురించి పత్రికలో వచ్చిన వార్తపై కేటీఆర్ స్పందించారు. తన కార్యాలయ సిబ్బందిని శ్రీవిద్య ఇంటికి పంపించి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడించారు. ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ ఇప్పించడంలో సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీవిద్య తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న కేటీఆర్.. ఆమె చదువు ఆగిపోవద్దనే ఉద్దేశంతో రెండేండ్ల స్కూల్ ఫీజును చెల్లించారు. భవిష్యత్తులో శ్రీవిద్య చదువుకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. కేటీఆర్ చొరవతో సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి అవసరమైన సర్టిఫికెట్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తమ సమస్య గురించి తెలుసుకుని శ్రీవిద్య జీవితానికి కొత్త వెలుగు అందించిన కేటీఆర్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తరు?

- ఉప ముఖ్యమంత్రి భట్టిని ప్రశ్నించిన ఉద్యోగ సంఘాలు
- పైరవీలు, పర్సంటేజీలు లేకుండా చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు సంబంధించిన రూ.8వేల కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నిలదీశారు. ఆయా సంఘాల జేఏసీ నేతలు శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అత్యవసర బిల్లులతోపాటు మెడికల్ బిల్లులు ఉండటం గర్హనీయమని పేర్కొన్నారు. ఈ బిల్లుల విడుదలకు పైరవీలు, పర్సంటేజీలతో సంబంధం లేకుండా చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఐదు డీఏలను చెల్లించాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించిన భట్టి మాట్లాడుతూ.. ఇక ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఏప్రిల్ నుంచి నెలకు 500 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను క్లియర్‌చేస్తామని హామీ ఇచ్చారు. టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కల్పించుకొని.. నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు మారం జగదీశ్వర్, కస్తూరి, ముత్యాల సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర్లు, పుల్గం దామోదర్‌రెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల బిల్లులు చెల్లించండి : ట్రెసా

రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) డిమాండ్ చేసింది. సప్లిమెంటరీ బిల్లులు, వాహన అద్దె చార్జీలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవులు, రిటర్మెంట్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, పీఆర్సీ ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల సంఘం తరపున 11 అంశాలను డిప్యూటీ సీఎం భట్టి ముందుంచారు.

ఏపీ నీటిచౌర్యంపై రేవంత్ మౌనం

- వరదజలాల పేరిట బనకచర్ల నుంచి అక్రమ తరలింపునకు ఏపీ కుట్ర
- సాగర్ కుడికాలువ నుంచి రోజూ ఏపీకి 10 వేల క్యూసెక్కుల తరలింపు
- సర్కార్ నోరు మెదపడం లేదెందుకు
- చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ
- వారి తీరు తెలంగాణకు గొడ్డలి పెట్టు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

"తెలంగాణ నీటి ప్రయోజనాలు రాష్ట్ర సర్కారుకు పట్టవా? ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోతుంటే మొద్దు నిద్ర నటిస్తారా? నీటి చౌర్యంపై ఏపీ సీఎం చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము.. సీఎం రేవంత్ సహా కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా?

- హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీటిని తరలించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తుంటే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకెళ్తున్నామని, తెలంగాణకు నష్టమేమీ లేదని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి అంటున్నారని తెలిపారు. దీనికి తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజూ 10 వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుపోతుంటే రాష్ట్రప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఒక్క నాయకుడికీ పట్టింపు లేదని మండిపడ్డారు. బనకచర్లతో తెలంగాణకేం నష్టమని చంద్రబాబు మాట్లాడి మూడురోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదని విమర్శించారు. 'చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణకు మోసం చేస్తారా? బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బీఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బీజేపీ తీరు తెలంగాణ తాగు, సాగునీటి రంగానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పడుతున్న ఆరాటం మీకెలాగూ అర్థం కాదు. కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి' అని హరీశ్‌రావు హితవు పలికారు.

రేవంత్ వల్లే మళ్లీ తాగునీటి కష్టాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతగాని తనం వల్లే ఉమ్మడి పాలన నాటి తాగునీటి గోస మళ్లీ ఇప్పుడు తెలంగాణలో చూడాల్సిన దుస్థితి దాపురించిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం చింతకర్ర గ్రామ గిరిజనులు తాగునీటి కోసం పడుతున్న కష్టాలపై శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. వ్యవసాయ బావి నుంచి గ్రామస్థులు బిందెలు, బకెట్ల ద్వారా నీటిని మోసుకొస్తున్న ఫొటోలను పోస్టు చేశారు. 'ఉమ్మడి పాలన నాటి నీటి గోస దృశ్యాలను సీఎం రేవంత్‌రెడ్డి వల్ల మళ్లీ చూస్తున్నాం. మిషన్ భగీరథ నీటి సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలమైంది. ఇది వేసవిలో మారుమూల గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. భుజాలుకాయలు కాసేలా బిందెలు మోస్తూ, వాగులు, వ్యవసాయ బావుల నుంచి నీళ్లు తెచ్చుకునే దుస్థితిని కల్పించింది. పథకాలు అమలులో వైఫల్యం. పరిపాలనలో వైఫల్యం. చివరకు కేసీఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ ద్వారా నీళ్లు సరఫరా చేయడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది' అని హరీశ్‌రావు ఫైరయ్యారు.

ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని వంద పడకల దవాఖాన ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

వంద పడకల దవాఖాన వద్ద బీఆర్ఎస్ ధర్నా

- డిప్యూటీ సీఎం నిర్లక్ష్యాన్ని గుర్తు చేస్తూ మధిర పట్టణంలో బైక్ ర్యాలీ
- కేసీఆర్ నిర్మించిన దవాఖానను ప్రారంభించాలి
- జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, మార్చి 7 : నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో నిర్మించిన వంద పడకల దవాఖానను ప్రారంభించాలని, ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్లక్ష్యం వీడాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంద పడకల దవాఖాన ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ లింగాల్ కమల్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలయినప్పటికీ తన సొంత నియోజకవర్గంలో వంద పడకల దవాఖాన ప్రారంభించడానికి డిప్యూటీ సీఎంకు తీరిక దొరకడం లేదా? అని ప్రశ్నించారు. కేవలం డబ్బులు వచ్చే పనులపైనే కాకుండా ప్రజలకు ఉపయోగకరమైన పనులపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎంను కోరారు.

కాంగ్రెస్ పాలనలో పెట్టుబడులు గాయబ్

- కేసీఆర్ హయాంలో 4 లక్షల కోట్ల పెట్టుబడులు
- నేడు తిరోగమనంలో తెలంగాణ రాష్ట్రం
- బీఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ హయాంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తే, రేవంత్‌రెడ్డి పాలనలో పెట్టుబడులు తరలిపోతున్నాయని బీఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. భారీగా పెట్టుబడులు వస్తున్నట్టు ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదని పేర్కొన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో తొమ్మిదేండ్లలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించినట్టు చెప్పారు. ఏబుల్‌లీడర్, స్టేబుల్ గవర్నమెంట్, ప్రోగ్రెసివ్ విధానాల ద్వారా నాడు కేసీఆర్ పాలన సాగిస్తే, నేడు అన్‌ఎఫిషియంట్ లీడర్, కరెప్టెడ్ గవర్నర్‌మెంట్, రిగ్రెస్సివ్ పాలసీల ద్వారా రాష్ట్రాన్ని తిరోగమనం దిశగా తీసుకెళ్తున్నారని మండిపడ్డారు. ప్రీమియర్ ఎనర్జీస్, అమరరాజా లాంటి కంపెనీలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని విమర్శించారు. గతంలో ఎల్ఆర్ఎస్ ఉచితంగా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.300 కోట్లు వసూలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. గచ్చిబౌలి లాంటి ఖరీదైన ప్రాంతాల్లో 400 ఎకరాలు అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు.

జీఆర్ఎంబీలో బనకచర్లపై చర్చ

- వచ్చే నెల 25న 17వ బోర్డు మీటింగ్
- ఇంకా ప్రాజెక్టు వివరాలివ్వాలని ఏపీ
- 11 తెలంగాణ ప్రాజెక్టుల్లో ఐదు ప్రాజెక్టులకే టీఏసీ అనుమతులు
- రెండు రాష్ట్రాల్లోని 16 ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలంటున్న జీఆర్ఎంబీ
- బోర్డు మీటింగ్ ఎజెండాలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చర్చించనున్నది. వచ్చే నెల 25న 17వ బోర్డు మీటింగ్‌ను నిర్వహించాలని జీఆర్ఎంబీ నిర్ణయించింది. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జనవరి 24న బోర్డుకు లేఖ రాశారు. అంతకుముందు జనవరి 4న ఈఎన్‌సీ జనరల్ కూడా బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఆ రెండు లేఖల ఆధారంగా ప్రాజెక్టుపై పూర్తి వివరాలను సమర్పించాల్సిందిగా జనవరి 9న బోర్డు ఆదేశించినా, ఇప్పటివరకు ఏపీ నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలోనే ఆ అంశంపై బోర్డులో చర్చించాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాలకూ సమావేశంపై బోర్డు సమాచారమిచ్చింది. మీటింగ్‌లో చర్చించే అంశాలనూ పంపింది.

రాష్ట్రానికి చెందిన 11 ప్రాజెక్టులకు లభించని అనుమతి

బోర్డు మీటింగ్‌లో రెండు రాష్ట్రాలకు చెందిన 15 ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులపై చర్చించనున్నారు. అందులో నాలుగు ఏపీకి సంబంధించినవి కాగా, మిగతా 11 ప్రాజెక్టులు తెలంగాణవే. తెలంగాణ చేపట్టిన 11 ప్రాజెక్టులకు అనుమతులు లభించలేదని ఎజెండా అంశాల్లో బోర్డు పేర్కొన్నది. 9 ప్రాజెక్టులకు సంబంధించి 8 డీపీఆర్‌లకు సీడబ్ల్యూసీ అప్రైజల్ కమిటీ ఆమోదం తెలిపినట్టు స్పష్టంచేసింది. అందులో రెండు ప్రాజెక్టులకు ఒకే కామన్ డీపీఆర్ ఉన్నదని వెల్లడించింది. అయితే, మిగతా రెండు ప్రాజెక్టులను అనుమతిలేని ప్రాజెక్టుల జాబితా నుంచి తొలగించాల్సిందిగా కేంద్ర జల్‌శక్తి శాఖను తెలంగాణ కోరిందని, దీంతో చనాకా-కొరాట బ్యారేజీ డీపీఆర్‌కూ సీడబ్ల్యూసీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నది. ఏపీకి సంబంధించిన ఏ ప్రాజెక్టుకూ కేంద్రం ఇంకా ఆమోదం తెలుపలేదని పేర్కొన్నది. అయితే, వెంకటనగరం పంపింగ్ స్కీం, బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి స్కీంల డీపీఆర్‌లను సీడబ్ల్యూసీ వెనక్కి పంపించిందని తెలిపింది. ఏపీ మరోసారి డీపీఆర్‌లను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది.

ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలి

2021 జులై 15న కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా రెండు రాష్ట్రాల పరిధిలో ఉన్న 16 ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలని జీఆర్ఎంబీ చెప్తున్నది. దానికి సంబంధించి 2021 జూలై 29న కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామని, దానిని అదే ఏడాది సెప్టెంబర్ 13న సబ్ కమిటీగా మార్చామని స్పష్టంచేసింది. బోర్డుకు అప్పగించాలని చెప్తున్న ప్రాజెక్టుల్లో 14 ప్రాజెక్టులను సీడబ్ల్యూసీ అధికారులతో కలిసి బోర్డు అధికారులు పరిశీలించారని పేర్కొన్నది. అయితే, పెద్దవాగు ఒక్కటే ఉమ్మడి ప్రాజెక్ట్ అని, దానిని తప్ప మిగతా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేది లేదని తెలంగాణ అధికారులు బోర్డుకు స్పష్టంచేశారు. ఏపీ మాత్రం ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంచేయలేదు. పెద్దవాగు ఆధునికీకరణపై ఏపీ తిరకాసు పెడుతుండటంతో దానిపైనా జీఆర్ఎంబీ సమావేశంలో చర్చించనున్నారు.

మానిటరింగ్ చేసేందుకు జీఐఎస్ హైడ్రాలజీ సెల్

జీఆర్ఎంబీలో ప్రాజెక్టులను ప్రత్యేకంగా మానిటరింగ్ చేసేందుకు జీఐఎస్ హైడ్రాలజీ సెల్‌ను ఏర్పాటుచేయాలని బోర్డు భావిస్తున్నది. ప్రాజెక్టుల పూర్తి సమాచారం, వాటి భద్రతను జీఐఎస్ ద్వారా విశ్లేషించాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే ఏడు అంశాల వారీగా ప్రాజెక్టులను జీఐఎస్‌తో పర్యవేక్షణ చేపట్టనున్నది. దీనిపై కూడా బోర్డు మీటింగ్‌లో చర్చించనున్నారు. బోర్డు బడ్జెట్, కొత్త పోస్టుల క్రియేషన్ తదితర అంశాలపై కూడా చర్చించనున్నారు.

మంత్రుల ఆదాయపన్ను సర్కారే చెల్లింపు

- మంత్రి శ్రీధర్‌బాబు ఆదాయపన్ను 1.38 లక్షలు చెల్లిస్తూ తాజాగా ఉత్తర్వులు
- ఇతర మంత్రులకూ సర్కారే చెల్లిస్తున్నవైనం

హైదరాబాద్, మార్చి 7(నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రుల ఆదాయ పన్నులను ప్రభుత్వమే చెల్లిస్తున్నది. ఇందులో భాగంగానే 2024-25 సంవత్సరం కింద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు చెందిన రూ.1,38,061 ఆదాయ పన్ను చెల్లిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీచేసింది. త్వరలో ఇతర మంత్రుల ఆదాయపు పన్నులను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిధులు చెల్లించాల్సిన అవసరం ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వనపర్తి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సస్పెన్షన్

- అవినీతి ఆరోపణలపై ఏసీబీ విచారణ

వనపర్తి, మార్చి 7 (నమస్తే తెలంగాణ): వనపర్తి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బీరం సుబ్బారెడ్డిని కలెక్టర్ శుక్రవారం సస్పెండ్ చేశారు. సుబ్బారెడ్డి బీసీ వెల్ఫేర్ నిధులు పక్కదారి పట్టించారని విద్యార్థి, కుల సంఘాలు కలెక్టర్‌తో పాటు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును విచారణ అధికారిగా నియమించారు. విచారణలో అవినీతి జరిగిందన్న రిపోర్టు ఆధారంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కార్పొరేషన్ ఖాతాలో ఉన్న నిధులను దుర్వినియోగం చేశారని, సిబ్బందితో పనులు చేయించుకున్నాడన్న ఫిర్యాదులూ వచ్చాయి. 2022 జూన్‌లో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిగా వచ్చిన ఆయన ఇన్‌చార్జి బీసీ వెల్ఫేర్ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. 3నెలల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినయ్‌ప్రభు, సివిల్ సప్లయి డీఎం ఇర్ఫాన్ సైతం ఇక్కడ పని చేసి సస్పెన్షన్‌కు గురయ్యారు.

రూ.95 కోట్ల మోసం.. ఒకరి అరెస్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : రూ.95 కోట్ల జీబీఆర్ క్రిప్టో కరెన్సీ మోసం కేసులో రాష్ట్ర సీఐడీ పోలీసులు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐడీ డీజీ శిఖాగోయెల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో